www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 28 | జనవరి | 2025 పేజీలు 8

## ఆ గ్రామాల్లో రైతుల ఖాతాల్లోకి భరోసా



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవ సందర్భంగా అమలు చేయనున్న రైతుభరోసా నగదు ఎంపిక చేసిన గ్రామాల్లో రైతుల ఖాతాల్లో జమ చేశారు. మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి ఆయా గ్రామాల రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ చేశారు. ఖమ్మంజిల్లాలోని 21 మండలాల్లో 21 గ్రామాలను ఎంపిక చేశారు. 21 గ్రామాల్లో 20802 మంది రైతులకు గాను రూ.28.42 కోట్లను ఆయా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాలకు గాను 25 గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల పరిధిలోని 22242 మంది రైతులకు గాను రూ. 39.07 కోట్లను జమ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు నగదు డ్రా చేసుకోవచ్చునని అర్హత కలిగిన ప్రతి రైతు ఖాతాలో నగదు జమ చేస్తామని ఆయన తెలిపారు.

# పుర పాలికలో ప్రత్యేక పాలన




**-సొసైటీలు మినహా అన్నింటికి ప్రత్యేకాధికారులే..**
**-ఇప్పట్లో ఎన్నికల నిర్వహణ లేనట్లే..**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో స్థానిక పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. ప్రాథమిక సహకార సంఘాలు, కేంద్ర సహకార బ్యాంక్ మినహాయించి మిగిలినవన్ని ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లాయి. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లందు మున్సిపాలిటీల పదవి కాలం ముగిసింది. ఖమ్మం కార్పోరేషన్ పదవి కాలం మరో 16 నెలల్లో ముగియనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీల పదవి కాలం ముగిసి ఏడాది గడిచిపోయింది. గతేడాది జనవరి 30న గ్రామ పంచాయతీల పదవి కాలం ముగిసింది. ఆ తర్వాత మండల పరిషత్, జిల్లా పరిషత్ పదవి కాలం ముగిసింది. స్థానిక ఎన్నికలు ముఖ్యంగా గ్రామ పంచాయతీల ఎన్నికలు అదిగో ఇదిగో అంటున్నారు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకో లేదు. ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల్లో పాలక వర్గం అందుబాటులో లేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. గ్రామ పంచాయతీల్లో

మిగతా 2లో..

## ఏసిబి వలలో
# అవినీతి వార్డ్ ఆఫీసర్



**-రూ.2,500 లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం**
**-మొదటి నుండి ఈయనది అవినీతి బాగోతమే..**
**-భారీగానే అక్రమ ఆస్తులు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఏసీబీ వేసిన ఉచ్చులో పడ్డాడు ఓ వార్డ్ ఆఫీసర్. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పథకాలలో పేరు చేర్చాలం లంచం కావాల్సిందేనని డిమాండ్ చేశాడు. సత్తుపల్లి మున్సిపాలిటీలో 23 వ వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న వార్డ్ ఆఫీసర్ నల్లంటి వినోద్. లంచం ఇచ్చుకోలేని బాధితులు ఈ నెల 24న ఖమ్మం ఏసిబి అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో సోమవారం వల పన్నిన ఏసిబి అధికారులు, పట్టణంలోని పాత సెంటర్‌లో గల ఓ జ్యూస్ సెంటర్ వద్ద బాధితుల నుండి రూ. 2,500/లు లంచం తీసుకుంటుండగా నల్లంటి వినోద్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మొదటి నుండి అవినీతి బాగోతమే. ఈ వార్డు ఆఫీసర్ ది మొదటి

మిగతా 2లో..

## అధికారుల తీరుతోనే
# ఆఫ్ టైప్ మొక్కలు




**-నర్సరీ నిర్వహణలో లోపాలు**
**-చిట్టడివిని తలపిస్తున్న నర్సరీ**
**-కాంట్రాక్టర్, అధికారుల జేబులు నింపుకోవడానికే నర్సరీ నిర్వహణ**
**-నీళ్లు లేక, పట్టించుకునేవారు కరువై తనువు చాలిస్తున్న మొక్కలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అధికారుల తీరుతోనే ఆఫ్ టైఫ్ మొక్కలు ఉద్భవిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని రేగళ్లపాడు నర్సరీలో సుమారు నాలుగు లక్షల ఆప్ టైప్ మొక్కలు రావడానికి పూర్తి కారణం అధికారుల అలసత్వమేనని రైతులు మండి పడుతున్నారు. నర్సరీలో మొక్కల నిర్వహణను నిజాంబాద్ కు చెందిన ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడని, అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై మొక్కలకు అందించాల్సిన పోషకాలు

మిగతా 2లో..

## అర్హులైన పేదలకు
# ప్రభుత్వ పథకాలు చేరాలి



**-లాభసాటి ఆయిల్ పామ్ సాగు చేయాలి**
**-చేసిన పని పదికాలాల పాటు గుర్తుండాలి**
**-రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు చేరాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని 15వ డివిజన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించి రూ.8.45 కోట్లతో అల్లిపురం మెయిన్ రోడ్డు నుంచి రామకృష్ణాపురం వరకు, అల్లిపురం నుండి జంగాల కాలనీ వరకు, అల్లిపురం ఎన్ టిఆర్ విగ్రహం నుండి ధంసలాపురం వరకు చేపట్టిన మూడు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కొంత మంది రైతులు ఆయిల్ పామ్ పంటలు బాగా వేశారని మిగిలిన రైతులు కూడా ఆయిల్ పామ్ సాగు చేయాలని కోరారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఎకరానికి రూ. 52వేల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మిర్చి, పత్తి, వరి పంటల కంటే అధికంగా లాభాలు వస్తాయని ఎకరానికి మూడు లక్షల

మిగతా 2లో..

# పుర పాలికలో ప్రత్యేక పాలన

(మొదటిపేజీ తరువాయి)
పారిశుధ్యం మొదలు అన్ని పనులు అస్తవ్యస్తంగా మారాయి. గ్రామ పంచాయతీలకు రావాల్సిన ప్రత్యేక నిధులు రావడం లేదు. సగం మంది సర్పంచులు గత ప్రభుత్వ హయాంలో చేసిన బిల్లుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ లకు పాలక వర్గాలు లేక ఇప్పుడు మున్సిపాలిటీల పదవి కాలం కూడా ముగియడంతో అధికారులపై ఆధారపడాల్సి వస్తుంది. వీలైనంత త్వరితగతిన ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఏదులాపురం, అశ్వారావుపేట మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. గతంలో మున్సిపాలిటీగా ఉన్న పాల్వంచను కొత్తగూడెం కార్పోరేషన్‌లో విలీనం చేశారు. మణుగూరు మున్సిపాలిటీకి ఎన్నికలు లేక దశాబ్దాలు గడిచింది. దాని భవితవ్యం ఏమిటో అర్థం కావడం లేదు. మణుగూరు మున్సిపాలిటీని గ్రామ పంచాయతీలుగా విడగొట్టాలన్న డిమాండ్ వినపడుతుంది. సారపాక పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. మేజర్ పంచాయతీగా ఉన్న సారపాకను మున్సిపాలిటీగా మార్చారు. దానికి సంబంధించి ఏజెన్సీ చట్టాల జోక్యం తదితర విషయాల్లో అడుగు ముందుకు పడడం లేదు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత తొందరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్ ఊపందుకుంటుంది.

# అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు చేరాలి

(మొదటిపేజీ తరువాయి)
వరకు ఆయిల్ పామ్ సాగు చేస్తే ఆదాయం లభిస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులు మూడేళ్ల వరకు కూరగాయలు, ఇతర అంతర పంటలు కూడా సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ప్రస్తుతం పత్తి, మిర్చి పంటల్లో తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గుతున్నాయని రైతులు ఇట్టి అంశాలను గమనించి ఆయిల్ పామ్ సాగు చేయాలన్నారు. ఆయిల్ పామ్ సాగు వల్ల కోతుల బెడద, తుఫాన్, దొంగల బెడద ఉండదన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో పాలన సాగిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం, రూ. 500 గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ క్రింద రూ.10లక్షల వైద్య సేవలు వంటి పథకాలు అమలు చేశామన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా పథకాలను ప్రారంభించామన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో అసలైన అర్హులకు పథకాలు చేరాలని ఎవరైనా అనర్హులు పథకాలకు ఎంపికైతే అధికారులకు సంపూర్ణ సమాచారం అందించాలని మంత్రి సూచించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.40వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టిందన్నారు. రైతు భరోసా క్రింద సాగుయోగ్యం కాని భూములకు పెట్టుబడి సాయం తొలగించామన్నారు. రైతు భరోసా క్రింద ఎకరానికి రూ. 12వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం రూ. 25వేల కోట్లు కావాలని రైతు భరోసా క్రింద రూ. 10వేల కోట్లు ఇస్తున్నామన్నారు. రుణమాఫీ క్రింద రూ.21వేల కోట్లు, రైతు బీమా క్రింద రూ.3వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. ఖమ్మం నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందించనున్నట్లు తెలిపారు. అర్బన్ పార్కులో ప్లాస్టిక్ నిషేధమని అక్కడికి వెళ్లేవారంతా ప్లాస్టిక్ వస్తువులను తీసుకెళ్లవద్దని మంత్రి సూచించారు.



15వ డివిజన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చిన తర్వాత బిటి రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. చేసిన పని పది కాలాల పాటు ఉండాలని సూచించారు. రోడ్లపై ర్యాంపుల నిర్మాణం చేపట్టవద్దని అలాంటి వాటిని తొలగించాలన్నారు. 15వ డివిజన్‌లో ఉన్న విద్యుత్ మీటర్ల సమస్య, పాసుపుస్తకాల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని మంత్రి సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్‌లో నగర కమిషనర్‌తో మాట్లాడి ఈ డివిజన్‌లో ఉన్న ఇంటి నెంబర్ల కేటాయింపు సమస్యను వెంటనే పరిష్కరించేందుకు క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆర్డీవో జి. నర్సింహారావు, పిఆర్ ఈఈ వెంకటరెడ్డి, ఆర్అండ్‌బి ఈఈ యుగంధర్‌రావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబు, కమర్తపు మురళి, సాధు రమేష్ రెడ్డి, సంక్రాంతి నాగేశ్వరరావు, చేతుల నాగేశ్వరరావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల తీరుతోనే ఆఫ్ టైప్ మొక్కలు

(మొదటిపేజీ తరువాయి)



ఎరువులు సకాలంలో అందించకుండా మొక్కలను నపూసకంగా తయారు చేస్తున్నారని మండిపడుతున్నారు. మూడు నెలలకు ఒకసారి మొక్కలకు బోరన్, మెగ్నీషియం, సూపర్, పొటాస్ లాంటి ఎరువులు తగిన మోతాదులలో అందించి, సమపాళ్ళలో నీరు అందించాల్సి ఉంటుందని, కానీ అలా కాకుండా అధికారులు సంవత్సరాలు గడిచిన వాటికి సరైన మోతాదులలో ఎరువులు అందించకుండా డబ్బులు నొక్కేస్తున్నారని ఆరోపిస్తున్నారు. టి జి ఆయిల్ ఫెడ్ కు రాష్ట్ర ప్రభుత్వం రూ.174 మొక్కల నిర్వహణకు అందిస్తుందని, మొక్కలకు సరైన నిర్వహణ లేకపోవడంతో, మొక్కలు సాగుకు పనికి రాకుండా పోతున్నాయని తద్వారా భారీగా నష్టం వాటిల్లుతుందని, ఈ నష్టమంతా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి వస్తుందని రైతులు తెలుపుతున్నారు. నర్సరీ ఇంచార్జ్, కాంట్రాక్టర్, సూపర్వైజర్లు నెల నెల జీతాలు తీసుకుంటూ సెల్ ఫోన్ లలో ఆటలాడుతున్నారు తప్ప, వారు చేసేది ఏమీ లేదని, నర్సరీని పర్యవేక్షించాల్సిన ఉద్యానవన శాఖ అధికారులు కూడా తూ, తూ మంత్రంగా తనిఖీలు చేపట్టి మ, మ అనిపిస్తున్నారంటున్నారు. పూర్తిగా అధికారుల నిర్లక్ష్యంతోనే ఆఫ్ టైప్ మొక్కలు అటు నర్సరీలలోనూ, ఇటు తోటలలోను పుట్టుకొస్తున్నాయని, పీజీ ఆయిల్ ఫెడ్ ద్వారా అందుతున్న మొక్కలను తీసుకొని సాగు చేస్తున్న రైతులు దివాళా తీస్తుంటే, అధికారులు మాత్రం భారీగా సొమ్మును కూడా పెట్టుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపక్షం తదితర పత్రికలలో వరుస కథనాలు వస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, తక్షణమే టి జి ఆయిల్ ఫెడ్ ఎండి అధికారుల తీరుపై, నర్సరీలలోని అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో జరుగుతున్న అమృత్ 2.0 స్కీమ్ అభివృద్ధి పనులను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. అనంతరం జంగాల కాలనీ లో ప్రజలను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీ డ్రైనేజి కాలువ పనులను పరిశీలించారు. అదే విధంగా పట్టణంలోని పాత ఎన్.టి.ఆర్ కాలువ పూడ్చివేత పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. దయానంద్ వెంట సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# ఏసిబి వలలో అవినీతి వార్డ్ ఆఫీసర్

(మొదటిపేజీ తరువాయి)
నుండి అవినీతి బాగోతమేనని సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు చక్కెర్లు కొడుతున్నాయి. గతంలో సత్తుపల్లి తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఏ గా విధులు నిర్వహించిన నల్లంటి వినోద్, అప్పటి తహశీల్దార్ అండతో అక్రమాలకు తెరలేపి భారీగానే ఆస్తులు కూడబెట్టినట్లు తెలుస్తుంది. పేదలనే ఇతను టార్గెట్ చేస్తాడని, ప్రతి పనికి లంచం కావాల్సిందేనని, లంచం లేకుండా ఫైలు కదపడనే పేరుంది ఇతగాడికి. తహశీల్దార్ కార్యాలయం నుండి మున్సిపాలిటీలోని 23వ వార్డుకి వార్డ్ ఆఫీసర్ గా వచ్చిన నాటినుండి ఇతని అవినీతి పరాకాష్టకు చేరిందని, చివరికి పాపం పండి అధికారుల చేతికి చిక్కాడని వార్డు ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

**సర్దుకున్న అధికారులు...**
సత్తుపల్లిలో ఏసీబీ అధికారుల రైడ్ జరుగుతుంది అనే సమాచారం దావానంలా వ్యాపించడంతో కొందరు అధికారులు గుట్టు చప్పుడు కాకుండా కార్యాలయాల నుండి పరుగులు పెట్టినట్లు తెలిసింది. ఎక్కడ ఏసీబీ అధికారులు తమపై పడతారో అనే ఆందోళనతో కొందరు తమ వాహనాలతో మాయమై పట్టణ శివార్లలోని మారుమూల పల్లెల్లో కాలక్షేపం చేసినట్లు గుస,గుసలు వినిపించాయి.

**సమాచారం ఇవ్వండి...**
సోమవారం సత్తుపల్లి పట్టణంలో అవినీతి వార్డ్ ఆఫీసర్ ను పట్టుకున్న ఏసిబి డిఎస్పి వై రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు లంచం అడిగినట్లయితే 1064 నెంబర్ కు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని, బాధితుల సమాచారాన్ని భద్రంగా ఉంచి, అవినీతి అధికారుల భారతం పడతామన్నారు. సమాచారం ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో మిస్ కానివ్వమన్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటామని ప్రజలు తమ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

## పదోన్నతి పొందిన ఎస్సైకి అభినందనలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సిటి కమాండ్ కంట్రోల్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి.కృష్ణరావు ఎస్సైగా పదోన్నతిపై బదిలి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక సిపి కార్యాలయం జరిగిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ సునిల్‌దత్ కృష్ణరావుకు అదనంగా స్టార్‌ను అమర్చి అభినం దించారు. గతంలో వివిద పోలీసు స్టేషన్లలో పలు హోదాల్లో విధులు నిర్వహించిన కృష్ణరావు భవిష్యత్తులో నేరాలు ఛేధించి గుర్తింపుతేచుకోవాలని ఆయన సూచించారు. సిపి వెంట అడిషనల్ డిసిపి లా అండ్ ఆడర్ ప్రసాదరావు ఉన్నారు.

## యూనివర్శిటి ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాకతీయ విశ్వవిద్యాలయం ఒప్పంద ఉపాధ్యాయుల ఆర్గనైజేషన్ జిల్లా సెక్రటరి పేరెల్లి కోటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం యూనివర్శిటి పిజి కళాశాలలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్ట్‌లను భర్తీచేస్తామని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ దీనివలన ఏళ్ల తరబడి వివిధ విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్, పార్ట్‌టైం, కన్సలెటెడ్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి సేవలకు తగిన విధంగా నిర్ణయం తీసుకున్న తరువాతే పోస్టులను భర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు, ఒప్పంద అధ్యాపకులు డాక్టర్ మోదుగు శ్యాంబాబు, డాక్టర్ కె.చలపతిరావు, డాక్టర్ ఎన్.రవిబాబు, డాక్టర్ జగజ్జీవన్‌రావు, డాక్టర్ ఎం.వీరాంజనేయులు, ఎ.వీరన్న, పి.మధు, పి.శ్రీనివాసరావు, జి.రమ పాల్గొన్నారు.

## విఓఎల జెఏసి శాశ్వత కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధిలోని కొమరం భీం ఆదివాసీ భవన్ నందు వీఓఏ (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ ) ల శాశ్వత కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి జిల్లాలో ఉన్న మండల కమిటీ సభ్యులు హాజరై జిల్లా కమిటీ రద్దు చేసి శాశ్వత కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పృధ్వీరాజ్ (ఇల్లందు), శ్రీను గోపాల్ (మణుగూరు), అధ్యక్షులుగా పవన్ (ఇల్లందు), ఉపాధ్యక్షులుగా రమేష్ (పాల్వంచ), నిర్మల (బూర్గంపహాడ్), ప్రధాన కార్యదర్శిగా జున్ను సత్యనారాయణ (అన్నపురెడ్డిపల్లి), కార్యదర్శిగా (అశ్వారావుపేట), కోశాధికారి వెంకటేశ్వర్లు (గుండాల), హరిబాబు (మణుగూరు, సహాయ కార్యదర్శిగా సాంబమూర్తి (కరకగూడెం), రాంబాబు (గుండాల)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ..వీఓఏ ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని, ప్రమాధ భీమా, ఆరోగ్య భీమా కల్పించాలని, గ్రామ సంఘం గ్రేడింగ్ తో సంబంధం లేకుండా వేతనాలు వీఓఏ స్వంత ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 13మండలాల అధ్యక్ష,కార్యదర్శులతో పాటు నాగేశ్వరావు, ప్రమీల, పాపారావు, విజయలక్ష్మి , నరేష్, అమీనా తదితరులు పాల్గొన్నారు.

## మందా కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంతో సోమవారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అలవాల రాజా మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వేల గొంతుల సాంస్కృతిక కార్యక్రమానికి భద్రాచలం నుండి ఇంటికొక వ్యక్తి డప్పుతో మహాప్రదర్శనలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో లత, తిరుపతి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, వీరరాఘవులు, నరేష్, వెంకన్న, బాలాజీ, సాయి, కుమారి నాగమణి, కృష్ణవేణి, సమత, ప్రశాంతి తదితరులున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

**-అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన జి. మౌనిక తనకు సొంత ఇల్లు లేకపోయినా ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు లేదని తనకు ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కొణిజర్ల మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన కుర్రా వీరభద్రం సర్వే నెం.299/అలో ఎకరం భూమి తన భార్య పేరు మీద రికార్డులో నమోదైందని 2016లో తన భార్య చనిపోయిందని అట్టి భూమి తన పేరు మీద నమోదు చేయాలని దరఖాస్తు చేసినప్పటికీ ఆ భూమిని ఇతరుల పేరిట మార్పిడి చేసి పట్టా పుస్తకం జారీ చేశారని దీనిపై విచారణ జరిపి తప్పుడు పట్టాను రద్దు చేసి తన పేరు మీద పట్టా జారీ చేయాలని దరఖాస్తు చేశారు. తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికి చెందిన శీలం నరేందర్ రెడ్డి మా గ్రామంలో గృహ నివాసాల మధ్య మొబైల్ టవర్ ఉందని దానిని తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. పువ్వాడ నగర్ గ్రామానికి చెందిన షేక్ సాధిక్ పాషా తాను గతంలో ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించానని గత డిసెంబర్ నెలలో మంత్రి పర్యటన సందర్భంగా గ్రామంలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇల్లు తనకు కేటాయించాలని అధికారులను ఆదేశించారని అయిన ఇప్పటి వరకు ఇల్లు కేటాయించలేదని డబుల్‌బెడ్‌రూం ఇల్లు కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్ అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణకు చర్యలు

**-ఫిబ్రవరి 10న మాత్రలు వేయించాలి**
**-జనవరి 30న కుష్టు వ్యాధిపై గ్రామసభలు**
**-అదనపు కలెక్టర్ పి. శ్రీజ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నులిపురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీజ నులిపురుగుల నివారణ, కుష్టు వ్యాధిగ్రస్తుల చికిత్స తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 19 ఏళ్ల లోపు ఉన్న పిల్లలందరికీ తప్పనిసరిగా మాత్రలు వేయించాలని అధికారులకు సూచించారు. నులిపురుగులు చాలా ప్రమాదకరమని వీటి వల్ల రక్త హీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వీటిని నివారిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. మొత్తం 3,11,317 మంది ఒకటి నుంచి 19 ఏళ్ల పిల్లలను జిల్లాలో గుర్తించినట్లు వారందరికీ అల్బెండోజోల్ మాత్రలు వేయాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలకు నులిపురుగుల మాత్రలు ఏపిహెచ్‌సి నుంచి వెళ్లేలా మ్యాప్ చేసి పెట్టుకోవాలన్నారు. జిల్లాలో అవసరమైన మేర నులి పురుగుల నివారణ మాత్రలను అందుబాటులో ఉంచామన్నారు. 1339 మంది ఆశా వర్కర్లు, 1739 మంది అంగన్‌వాడీ టీచర్లు, 1260 మంది వైద్య సిబ్బంది నులిపురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 10న మాత్రలు అందించని విద్యార్థులకు ఫిబ్రవరి 17న తప్పనిసరిగా అందించాలని ఆమె తెలిపారు. జనవరి 30న గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి కుష్టు వ్యాధి పై అవగాహన కల్పించాలని మనకు కుష్టువ్యాధి గ్రస్తులు తగ్గుతున్నప్పటికీ ఇప్పటికీ ఆ వ్యాధి వస్తుందన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతిబాయి, ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ అధికారి, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, డిఈవో సోమశేఖర శర్మ, డిడబ్ల్యూవో కె. రాంగోపాల్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపాల్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించండి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రానున్న శాసన మండలి ఎన్నికల్లో పిఆర్‌టియుటిఎస్ ఎంఎల్‌సి అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని మాజీ ఎంఎల్‌సి బి. మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పిఆర్‌టియు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ ఎంఎల్‌సి బి. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే శాసన మండలి ఎన్నికల్లో పిఆర్‌టియు అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. పిఆర్‌టియుని స్థాపించి 54 ఏళ్లు పూర్తి కావస్తుందని అనేక ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకువచ్చి ఉపాధ్యాయుల జీవన ప్రమాణస్థాయిని పెంచామని ఆయన తెలిపారు. రాష్ట్ర సంఘం అధ్యక్షునిగా, ఎంఎల్‌సిగా పనిచేసిన సమయంలో తాను అనేక ప్రభుత్వ ఉత్తర్వులను తీసుకువచ్చినట్లు మోహన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఉపాధ్యాయులకు బదిలీ కౌన్సిలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి అవినీతి, రాజకీయ జోక్యం లేకుండా ఉపాధ్యాయులకు ఆత్మగౌరవాన్ని కల్పించేవిధంగా కృషి చేశామన్నారు. అప్రెంటిస్ కాలానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జీవో సాధించామన్నారు. రెండు జీవోలు సాధించి జెఎల్స్, డైట్ లెక్చరర్స్, హెడ్ మాస్టర్ల ప్రమోషన్లు, పిడి ప్రమోషన్లు మొదలగు ఉత్తర్వులు సాధించామన్నారు. హెల్త్ కార్డ్స్ కమిటీలో పిఆర్‌టియు పక్షాన శ్రీపాల్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్నారని తొందరలోనే హెల్త్ కార్డ్స్ విడుదల కానున్నాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శ్రీపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో మాజీ రాష్ట్ర సంఘం అధ్యక్షులు పి. వెంకటరెడ్డి,జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్. రంగారావు, ఉపాధ్యక్షులు శేఖర్‌రావు, ఎల్. సతీష్, ఆంజనేయులు, సతీష్, ఆఫీస్ ఇంచార్జి కందుల వెంకటనర్సయ్య, సాధు లక్ష్మణ్‌రావు, కెవి రమణ, తాళ్లూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# ఆకర్షణీయంగా పూల మొక్కలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో డివైడర్లపై ఏర్పాటు చేసిన పూల మొక్కలు పచ్చదనంతో ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. నగర సుందరీకరణలో భాగంగా ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లోని డివైడర్ల మధ్య వివిధ రకాల పూల మొక్కలను ఖమ్మం కార్పోరేషన్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వాటిని గార్డెన్, డివైడర్ మెయింటినెన్స్ వర్కర్స్ ఆధ్వర్యంలో మొక్కలు ఎండిపోకుండా సంరక్షించడంతో అవి ఇప్పుడు పచ్చదనంతో వివిధ రంగుల పూలతో ఆకర్షిస్తూ ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి.





# ఏఎంసి నూతన కమిటీకి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా కూరగాయల మార్కెట్ కమిషన్ వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఖమ్మం మార్కెట్ పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యరగర్ల హన్మంతరావు, వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్, డైరెక్టర్లను కూరగాయల మార్కెట్ కమిషన్ వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు తోట రామారావు ఆధ్వర్యంలో పలువురు వ్యాపారస్తులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఖమ్మం మార్కెట్ అభివృద్ధికి నూతన పాలక వర్గం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు గోపిశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి అవినాష్, కోశాధికారి జక్కుల రామకృష్ణ, వైస్ ఛైర్మన్ నల్లగట్ల వెంకటేశ్వర్లు, రవికుమార్, నాళ్ల సతీష్, కార్యవర్గ సభ్యులు వెంపటి వెంకన్న, మునగాల వెంకన్న, ఆర్. రాజేంద్ర, నర్సింహారావు, సిహెచ్ గిరి, బి. రామకృష్ణ, వి. నగేష్, సిహెచ్ వీరభద్రం, బాలచందర్, తోట వీరభద్రం, జి. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యుపిఎస్‌ను విరమించాలని వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టబోతున్న యునిఫైడ్ పెన్షన్ సిస్టం (యుపిఎస్)ను విరమించుకోవాలని కోరుతూ పిఆర్‌టియు రఘునాథపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రం కేశవరావు, తూమాటి సైదుబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టబోతున్న యునిఫైడ్ పెన్షన్ సిస్టం (యుపిఎస్) వల్ల ఉద్యోగులకు శాపంగా మారనుందని దానిని తక్షణమే విరమించుకోవాలని వారు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పెన్షన్‌ను అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ సోమ్లా నాయక్, రాష్ట్ర బాధ్యులు రేపాల శ్రీనివాసరావు, సంఘం సభ్యులు వినోద్‌కుమార్, ముకుందరావు, నాగమల్లేశ్వరచారి, మూర్తి, మహిళా సభ్యులు జూకంటి సుజాత, చిలక కవిత, పైజా తదితరులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ డిఎం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నేడు ఖమ్మం ఆర్టిసి డిపో పరిధిలో డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో పరిధిలోని ఆర్టిసి బస్సులకు సంబంధించిన ఏమైనా సూచనలు, సలహాలు, సమస్యలను తెలియజేయాలని ఆయన తెలిపారు. 9959225958 నెంబర్‌కు తమ సమస్యలను పైన తెలిపిన సమయంలో తెలపవచ్చునని తెలిపారు.

# నర్సరీ ఏర్పాటుకు భూమి కేటాయింపు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని మొక్కల పెంపకానికి నర్సరీ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు 36 కుంటల భూమిని కేటాయించారు. ఖమ్మం కార్పోరేషన్‌లో మొక్కల పెంపకం కోసం నర్సరీ ఏర్పాటుకు భూమిని కేటాయించాలని కలెక్టర్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ కోరగా స్పందించిన కలెక్టర్ భూమిని కేటాయించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి 52వ డివిజన్ పరిధిలో ఎన్నెస్పి స్థలంలో 36 కుంటల భూమిని సర్వే చేసి మున్సిపల్ అధికారులకు సోమవారం అప్పగించారు.

# అందరి సహకారం మరువలేనిది

**ప్రజాసేవకే అంకితం : కౌన్సిలర్ ఫణితి ఉష సైదులు**



**ప్రజాపక్షం/వైరా:** ఐదు సంవత్సరాలుగా వైరా మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా విధులు నిర్వహణలో మాకు అందించిన అందరి సహకారం మరువలేనిదని మాఈజ 7వ వార్డు కౌన్సిలర్ ఫణితి ఉషా సైదులు దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఫణితి ఉషా సైదులు దంపతులు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేశామని, పదవి ఉన్నా లేకపోయినా నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటామని, ప్రజా సమస్యల కోసమే పనిచేస్తామని అన్నారు. ఐదు సంవత్సరాల పదవీకాలంలో వార్డులోని ప్రజలు యువత మాకు అందించిన సహాయ సహకారాలను మద్దతును ఎప్పటికి మరిచిపోము, మీ ప్రేమానురాగాలు ఎప్పుడు మా మదిలోనే ఉంటాయని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కూడా వార్డు ప్రజలు మాకు మద్దతుగా నిలిచారని, భవిష్యత్తులో కూడా వార్డు ప్రజలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని అందరికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజల మధ్యనే ఉంటామని తెలిపారు. అభివృద్ధి విషయంలో మా రాజకీయ ప్రస్తానంలో మాకు వెన్నుదన్నుగా ఉన్న మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్ అందించిన తోడ్పాటు మరువలేమని, అదే విధంగా అభివృద్ధి కోసం సహకరించిన ప్రజాప్రతినిధులకు ప్రతిఒక్కరికి రుణపడి ఉంటామని, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చూపిన ప్రేమ ఎప్పటికి గుర్తుంటుంది, మరలా ప్రజాక్షేత్రంలో ఉండే అందుకే కృషి చేస్తామని తెలిపారు.

# గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించండి



**-సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా**
**-ఐటిడిఏ, అటవీ శాఖ అధికారులకు వినతి**

**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి:** లక్ష్మీదేవిపల్లి మారుమూల ఏజెన్సీ గ్రామాల పోడు రైతులకు సాగునీటి సౌకర్యం ఏర్పాటు కోసం విద్యుత్, మోటార్లు ఏర్పాటు చేయాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా కోరారు. మండలంలోని లక్ష్మీపురం, బొజ్జల గూడెం, చింతకుంట గ్రామపంచాయతీల్లో పర్యటించి అక్కడి పోడు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమస్యను వివరించారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ మూడు గ్రామపంచాయతీల్లోని గిరిజన రైతులు అనాదిగా పోడు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారని, వీరి భూములకు సాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సుమారు 120 మంది గిరిజన రైతులు తమ భూములకు విద్యుత్, బోర్లు ఏర్పాటు చేయాలని దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. అధికారులు స్పందించి త్రిఫేస్ విద్యుత్, బోర్లుర్పాటు చేయడం ద్వారా గిరిజనులకు సాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారా శ్రీనివాస, వర్స రామస్వామి, జోగా రామయ్య, కంటెం సత్యనారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా సోమవారం నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ కు, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం కార్మికులు గత 22 సంవత్సరాలుగా శ్రమ దోపిడికి గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వవలసిన కోడిగుడ్ల బిల్లులు గత పది నెలల కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వీటిని తక్షణమే ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వవలసిన రూ. 2000/ రూపాయల గౌరవ వేతనం 10 నెలలుగా పెండింగ్ ఉన్నాయని తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఖమ్మం జిల్లా అధ్యక్షులు గాదేలక్ష్మీ నారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజన పథకం వర్కర్ సంఘం రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, ఏఐటీయూసి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా కార్యదర్శి గుండెపొంగు మల్లేష్, టి.రామారావు, తాళ్లూరు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులపై దాడిని ఖండించిన ఎంఎల్‌సి తాతా మధు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాల పాడు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కోడెం రవిపై కాంగ్రెస్ పార్టీ నాయకుల దాడిని బిఆర్ఎస్ ఖమ్మంజిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ తీవ్రంగా ఖండించారు. బెండాల పాడు గ్రామంలో ఆదివారం నాలుగు పథకాల అమలుకు సంబంధించి ఏర్పాటు చేసిన సభలో బిఆర్ఎస్ నాయకుడు కోడెం రవిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయగా తలకు బలమైన గాయాలయ్యాయి. రవిని ఖమ్మంలోని కార్తీక్ మల్టీస్పెషాలటీ ఆసుపత్రి నందు చేర్చి చికిత్స నందిస్తున్నారు. సోమవారం ఎంఎల్‌సి తాతా మధుసూదన్, అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు కోడెం రవిని, కుటుంబ సభ్యులను ఆసుపత్రిలో పరామర్శించారు. రవిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని న్యాయం జరిగే వరకు పోరాడతామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి తాతా మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వ సభ నందు ఇటువంటి దాడి జరగడం సిగ్గు చేటన్నారు. దీనిని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన తెలిపారు. ఈ దాడికి పాల్పడ్డ ప్రతి ఒక్కరికి శిక్షపడేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, మోహన్‌రావు, జి. శ్రీను, అశ్వారావుపేట నియోజక వర్గ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనధికారులు వేదిక పైన.. అధికారులు వేదిక ముందు...

**ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ఎక్కడ..?**





**ప్రజాపక్షం/ఖమ్మం :** తల్లాడ మండలం కొడవటిమెట్ట గ్రామంలో ఆదివారం రాత్రిజరిగిన నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభం కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద పాల్గొన్నారు. ప్రోటోకాల్ ఎక్కడ పాటించలేదు. మండల పరిషత్ అధికారి చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్టేజిపై అనధికారులు కూర్చొంటే స్టేజి క్రింద పక్కకు అధికారులు కూర్చొన్నారు. ఇది పూర్తిగా ప్రోటోకాల్‌కు విరుద్దంగా జరిగింది. బాధ్యత గల ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ కార్యక్రమం జరిగేటప్పుడు ఆ కార్యక్రమంలో స్టేజిపై అధికారం యంత్రంగా మాత్రమే ఉండాలి. ప్రజాప్రతినిధులు ఉండాలి. కాని కొడవటిమెట్ట గ్రామంలో జరిగిన ప్రభుత్వ అధికార కార్యక్రమంలో అధికారులు క్రింద కూర్చొబెట్టి కాంగ్రేస్ నాయకులు స్టేజిపై కూర్చోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బాధ్యత గల ప్రభుత్వ అధికారి అయి ఉండి ఆ ప్రభుత్వ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తల్లాడ మండల పరిషత్ అధికారికి చంద్రమౌళి ఈ విషయం తెలియదా. ఎందుకంటే నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభం కార్యక్రమంలో రైతు భరోసాకి సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమానికి సంబంధించి ఉపాధిహామీ అధికారి, ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం గురించి రెవిన్యూ అధికారులు స్టేజి మీద ఉండాలి. రేషన్‌కార్డులు నిర్మాణం గురించి పంపిణీ గురించి రెవిన్యూ అధికారులు ఉండాలి. కాని సంబంధిత శాఖ అధికారులకు స్టేజిపైకి పిలిచిన సందర్భంగా లేదు. పూర్తిగా మండల పరిషత్ అధికారి ప్రోటోకాల్ విస్మరించారు. స్థానిక సభ్యురాలు అధికార యంత్రాంగాన్ని స్టేజి మీదకి పిలవకపోవడం బాధాకరం. అధికార పార్టీ నేతలను పదేపదే స్టేజి మీదకు రావాలని పిలవడం పూర్తిగా ప్రోటోకాల్ నిబంధనకు విరుద్దమని చెప్పవచ్చును. దీనిపై జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

# మందా కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించినందుకు ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని మంచు కొండ గ్రామంలో మంద కృష్ణకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎస్సి, ఎస్టి, బిసి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 29న రెవెన్యూ మేళా

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో ఈనెల 29న రెవెన్యూ మేళాను నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే రెవెన్యూ మేళాలో రెవెన్యూ తప్పుల సవరణ, ఇంటి పన్ను నమోదులో తప్పులు, ఇంటి పన్ను ఎక్కువగా పడిన వారి సమస్యలు, డబుల్ ఇంటి నెంబర్ల నమోదు, పంపు పన్ను సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను ఏడు రోజుల్లో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

**30న రెవెన్యూ క్యాంపు...**

ఈనెల 30న గురువారం ఉదయం 10.30 గంటలకు ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని అల్లిపురం నందు రెవెన్యూ ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఇంటి పన్ను లేని వారి కోసం ఈ క్యాంపులో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. అల్లిపురంలో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

# సిపిఐ సీనియర్ నాయకులు శంకర్ అకాల మరణం



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం భాగ్యనగర్ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు గుగులోత్ శంకర్ నాయక్ గుండె పోటుతో ఆదివారం రాత్రి అకాల మరణం చెందారు. శంకర్ నాయక్ గతంలో సిపిఐ తరుపున ఎంపిటిసిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఇడిపోయినప్పటికి, పార్టీ కార్యక్రమా లలో చురుకుగా పాల్గొని ప్రజా ఉద్యమాలలో ముందుండె వారు మృతుడి భార్య. కుమారుడు, కుతూరు అన్నారు. సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జ్ యర్రా బాబు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. మరణం పట్ల తీవ్ర సంతాపం కుటుంబానికి సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల నాయకులు ఇస్లావతు భావ్‌సింగ్, గుగులోత్ మాంగు, కీల్యా, హరిసింగ్, ఏఐటియూసి భూపాలపల్లి బ్రాంచ్ నాయకులు ఇస్లావత్ ధళసింగ్, గుగులోత్ చందా రాందాబు, మాజీ జెడ్‌పిటిసి వాంకుడోత్ జగన్, గుగులోత్ భావ్‌సింగ్, నాగేష్, తదితరులు ఉన్నారు.

# బిఆర్ఎస్ నాయకులపై దాడి హేయమైన చర్య



**ప్రజాపక్షం/ములకలపల్లి:** చంద్రుగొండ మండలంలోని బెండలపాడు గ్రామంలో బిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం అత్యంత హేయమైన చర్యలగా భావిస్తున్నామని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మోరంపూడి అప్పారావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల పక్షాన మా గొంతు వినిస్తామని, అంత మాత్రం చేత దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి ప్రతిపక్ష నాయకులపై కేసులు, దాడులు, బూతులు మీద దృష్టి పెట్టారే తప్ప పరిపాలన మీద పథకాల అమలు తీరు మీద దృష్టి పెట్టలేదన్నారు. కలిసి మెలిసి ఉండాల్సిన పచ్చని పల్లెల్లో నెత్తుటి మరక అంటించాని, ఈ దాడి సంఘటనని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా పరిపాలన మీద దృష్టి పెట్టి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంతిమంగా పేదవాడికి లబ్ది చేకూరాలని బిఆర్ఎస్ నుండి మేము డిమాండ్ చేస్తున్నామన్నారు.

# నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ మధిర :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుపిఎస్ ఫెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పిఆర్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం టిఎస్‌పిఆర్‌టియు మండలశాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కార్యాలయం ఎదుట యూపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపి వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సిపిఎస్ నూతన ఫెన్సన్ విధానాన్ని రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పాత ఫెన్షన్ విధానాన్ని పునరద్ధరించకుండా కంటి తుడుపు చర్యగా యుపిఎస్(యునైటెడ్ ఫెన్షన్ స్కీమ్)ను తీసుకువచ్చి ఉద్యోగులను మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలే సుధాకర్, రాష్ట్ర బాధ్యులు ఎస్‌కె.మదార్, తూమాటి కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**
**-విద్యానగర్‌లో గ్రామసమాఖ్య భవనం ప్రారంభం**





**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** మహిళలు ఆర్థికాభివృద్ధివైపు అడుగులు వేయాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా కోరారు. చుంచుపల్లి మండల పరిధిలోని విధ్యానగర్లో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన వెలుగు కిరణం గ్రామా సమాఖ్య కార్యాలయాన్ని సోమవారం అయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితమయ్యే రోజులకు స్వస్తి పలకాలని సూచించారు. సమాఖ్య ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపారాలవైపు అడుగులు వేయడం ద్వారా కుటుంబ ఆర్థిక అవసరాలు తీర్చుకొని కుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. బ్యాంకులు సకాలంలో రుణాలు మంజూరు చేసి సంఖ్యలను ప్రోత్సహించాలని కోరారు. సమాఖ్య సౌకర్యార్థం భావన నిర్మాణానికి దాతలు ముందుకురావడం అభినందనీయమన్నారు. స్థానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో నియోజకవర్గం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని, కూనంనేని చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు. అనంతరం సమాఖ్య సభ్యులు సాబీర్ పాషాను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, స్థానిక నాయకులు, దాతలు వర్ధన్ రావు, శ్యామ్, కృష్ణ, కృష్ణమూర్తి, నాగేశ్వర్ రావు, రాంబాబు, మని, రామకృష్ణ, ప్రభ, సామినేని రామారావు, మాగోరెడ్డి, రాణి, ప్రసాద్, వివిధ బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేసు విచారణలో జాప్యం తగదు : ఎస్‌పి




**ప్రజాపక్షం/భద్రాచలం :** కేసుల విచారణలో ఎలాంటి జాప్యానికి తావుండరాదని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నెలవారీ సమీక్షలో జిల్లాలోని పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ ప్రతీ కేసులో క్వాలిటీఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. పోలీస్ అధికారులంతా బాధ్యయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నిషేదిక గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలైన యువత వారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని మత్తు పదార్థాలు విక్రయించే వారిపై నిఘా పెట్టి అరెస్టు చేయాలన్నారు. దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేయాలని, నేరాల నివారణకు సిసి కెమోరాలు ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాలపై బాధితులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుండాలని, జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదు పోగొట్టుకుంటే వేగంగా స్పందించి రికరీ చేసేందుకు పాటుపడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అప్రమత్తపు బోర్డులను అమర్చాలని, రాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని, లైసన్సులు లేకుండా వాహనాలు నడిపే వారిని గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. మధ్యం సేవించి వాహనాలు నడపడం నేరమని, వారి వల్ల ఇతరులకు పెద్ద ఎత్తున ఇబ్బందులు వస్తున్నారని దానిపై నిఘాపెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గతనెల్లో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఎస్‌పి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్‌పి విక్రాంత్ సింగ్ , కొత్తగూడెం డిఎస్‌పి రెహమాన్, పాల్వంచ డిఎస్‌పి సతీష్, ఇల్లందు డిఎస్‌పి చంద్రభాను, మణుగూరు డిఎస్‌పి రవీంధర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్‌పి మల్లయ్య స్వామి, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్




**ప్రజాపక్షం/భద్రాచలం :** జిలాల్లో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. సోమవారం ఐడిఓసిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జనవరి 29 నుండి ఫిబ్రవరి 22 ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5 నుండి 25 వరకు రాతపరీక్షలు జరుగుతాయని, వీటి నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మొదటి సం.లో 10173 మంది, ద్వితీయ సం.లో 10062 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ప్రాక్టికల్ కోసం జిల్లాలో 62 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉ.9 గం. నుంచి మ.12గం. వరకు జరుగుతాయని, మ.2గం. నుండి సా.5 గం.ల వరకు రెండు సెక్షన్లలో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాటు చేయాలని, పరీక్షలకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఉండాలన్నారు. రాతపరీక్షల విషయంలో చదువుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించి నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చేలా అంతా కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధిఆకరి సిహెచ్ వెంకటేశ్వరరావు, కొత్తగూడెం ఏఆర్‌డిఎస్‌పి సత్యనారాయణ, జూనియర్ కాలేజీ ప్రన్సిపల్ సులోచనరాణి, ఎగ్జామినేషన్ కో ఆర్డినేటర్ అరవింద్‌బాబు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మరణంలోనూ వీడని భార్యాభర్తల బంధం

**-భర్త మరణించిన గంటల వ్యవధిలోనే భార్య మృతి**
**-సామాజిక కార్యకర్త కర్నె రవి ఇంట విషాదం**



**ప్రజాపక్షం/మణుగూరు :** మూడు ముళ్ళు, ఏడడుగులతో ఏర్పడిన ఆ బంధం కాటికి చేరే వరకూ అలాగే సాగింది. అనారోగ్యంతో భర్త మృతి చెందిన గంటల వ్యవధిలో భార్య కూడా కన్నుమూసింది. ఈ విషాద ఘటన మణుగూరు మండలం పగిడేరు గ్రామంలో జరిగింది. భార్యాభర్తల బంధం శాశ్వతం. వారిరువురు ఒకరికోసం ఒకరు బతకడమే జీవితం.. ఇది నిజం.. అందుకు సజీవ సాక్ష్యం ఆ దంపతుల జీవితం.. వివరాల్లోకి వెళితే.. పగిడేరు గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త కర్నే రవి తండ్రి సోమయ్య అనారోగ్యంతో ఈనెల 24న మృతి చెందారు. కాగా తన భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య కర్నె నాగమ్మ గుండె ఆగిపోయింది. జీవితాంతం తోడు నీడగా ఉంటామని చేసిన పెళ్లి నాటి ప్రామాణాన్ని పాటిస్తూ భర్త వెంటే పయనించింది ఆ ఇల్లాలు. మృత్యువు లోను వారి బంధం విడిపోలేదు. సోమవారం భార్య నాగమ్మ గుండెపోటుతో మృతి చెందింది. గ్రామానికి చెందిన భార్య భర్తలు, సామాజిక కార్యకర్త రవి మాతృ మూర్తులు ఇద్దరు కొన్ని గంటల సమయంలోనే చనిపోవడంతో రవి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు ఆయనను పరామర్శించి మనోధైర్యం చెప్పారు.

# శాఖమూరి రమేష్‌పై అక్రమ కేసులు కొట్టివేత



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్, మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ శాఖమూరి రమేష్ పై సోమవారం కేసు కొట్టివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన శాఖమూరి రమేష్, ప్రస్తుత మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లకు ప్రధాన అనుచరుడుగా ఉన్నారు. కాగా పార్టీలో కీలకంగా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. దీంతో గత ప్రభుత్వం హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులు రమేష్ పై కక్ష సాధింపు లో భాగంగా అక్రమ కేసులు బనాయించారు. ఇటీవల రమేష్ పై ఉన్న రౌడీషీటర్ ను ఎత్తివేశారు. తాజాగా సోమవారం ఎస్సీ, ఎస్టీ అక్రమ కేసును న్యాయస్థానం కొట్టివేసింది. ఈ సందర్భంగా ఆయన అభిమానులు మాట్లాడారు. రాజకీయ క్షక్షలో భాగంగా అక్రమ కేసులు బనాయించారని పేర్కోన్నారు. చట్ట పరంగా రమేష్ పోరాడారని అన్నారు. పలు అక్రమ కేసులు కొట్టివేసినట్లు పేర్కోన్నారు. క్లీన్ చిట్ రావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తప్పులు కేసులకు చెంప పెట్టు గా పేర్కోన్నారు.

# క్షేత్రస్థాయిలో ప్రతీ అధికారి అందుబాటులో ఉండాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామ స్థాయి లో అన్ని శాఖల అధికారులు గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. గత నెలలో జరిగిన సమావేశంలో వచ్చిన అంశాల పై వాటి పరిష్కారాల ను అడిగి తెలుసుకున్నారు. శాఖల వారీగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన అన్ని శాఖల పనులను శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల లో పనులలో వేగం పెంచాలని సూచించారు. పనుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వసతి గృహాలలో విద్యార్థులకు అందించే మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, వివిధ శాఖల అధికారులు బాలకృష్ణ, భాస్కర్, నారాయణ రావు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లి దేవాలయం అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గంగమ్మ తల్లి దేవాలయం అభివృద్ధి ని శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కమిటి చైర్మన్ మన్నె రవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక దేవాలయంలో యాదవ సంఘం, గంగమ్మ కమిటి ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. దేవాలయం నూతన కమిటి పై చర్చించారు. కమిటిలో చైర్మన్ గా మన్నె రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాక్షుడు గా కురాకుల ఉపేందర్, కోశాధికారి గా మొగరపు రోశయ్య, కమిటి సభ్యులు గా తెల్లమేకల శేషుబాబు, దోతి చంద్రం, చిలకల ఉపేందర్, దిడ్డు రాములు, రేపాకుల కుమార్, మెట్టేల సంపత్, చిన్నబోయిన మల్లయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మన్నె కృష్ణారావు, గొలుసు రవిపాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటి కప్పుడు పరిష్కరించి ప్రజలు న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. ఈ మేరకు జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి ఆయన దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు బట్వాడా చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కరానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి సుదూర ప్రాంతాల నుండి వచ్చి అర్జిలు సమర్పిస్తుంటారని, వారిని నమ్మకంపై నీళ్లు చల్లకుండా అధికారులు క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. పరిష్కారానికి నోటుకోని వాటిపై తగిన నివేదకలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యుపిఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి



**ప్రజాపక్షం/బోనకల్‌:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యుపిఎస్ విధానాన్ని ఉపసంహరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పిఆర్‌టియూ ఆధ్వర్యంలో తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్‌కు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో పిఆర్‌టియూ జిల్లా నాయకులు రత్నకుమార్, కొమ్ము శ్రీనివాసరావు, సిహెచ్ రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శి మద్దినేని వెంకటేశ్వరరావు, నాయకురాలు ఝూన్సీరాణి, రవికిరణ్, రామారావు, రాజేష్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# మ్యూజియంలో పాతకాలపు వస్తువులు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ ప్రాంగణంలో పర్యాటకుల కోసం ఏర్పాటు చేస్తున్న మ్యూజియంలో పాతకాలపు వస్తువులు సేకరించి ఏర్పాటు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ పిఓ బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న గిరిజన మ్యూజియం ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. బోట్ షికారు, క్రీడా ప్రాంగణం కోసం జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఇప్పటికే పలు గిరిజన సాంప్రదాయాల వస్తువులు పెద్ద ఎత్తున సేకరించడం జరిగిందని, గిరిజన సాంప్రదాయ పెళ్లిళ్లకు సంబంధించిన వస్తువులను కూడా ఏర్పాటు చేయాలన్నారు. శ్రీరామనవమి నాటికి గిరిజన మ్యూజియంను పూర్తి స్థాయిలో అందుబాటులోనికి తెస్తామని, ఇప్పటికే దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, డిడి మణెమ్మతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీ హవర్స్ సక్రమంగా నిర్వహించాలి

**- ఐటిడిఏ పిఓ బి. రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు స్టడీహావర్స్ సక్రమంగా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశంలో మందిరంలో నిర్వహించిన గిరిజన ధర్బారుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గిరిజన గ్రామాల నుండి వచ్చిన వారిపై ఆయన వనతులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. అనంతరం పిఓ మాట్లాడుతూ గిరిజనులు వారి సమస్యల పరిష్కారం వచ్చి దరఖాస్తులు అందిస్తున్నారని, వాటి పరిష్కారానికి అధికారులంతా కృషి చేయాలన్నారు. పరిష్కారానికినోచుకోని వాటిపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్నాయని, చదువుల్లో వెనుకబడిన వారిని గుర్తించి వారికి సరై స్టడీ హావర్స్ నిర్వహించి భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలు అర్హులైన గిరిజనులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ డేవిడ్ రాజ్, డిడి మణెమ్మతో పాటు ఐటిడిఏలోని అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన పాలకవర్గ పదవీకాలం.. ఘనంగా వీడ్కోల సభ




**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సోమవారం కొత్తగూడెం మున్సిపాలిటీ ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసింది. ఈ సందర్భంగా 36 వార్డుల కౌన్సిలర్లకు చైర్మన్, వైస్ చైర్మన్ లకు మునిసిపాలిటీ అధికారులు ఘనంగా వీడ్కోల సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ, గడిచిన 5 సంవత్సరాలలో వార్డు కౌన్సిలర్లు వైస్ చైర్మన్ పాలకమండలి సభ్యులు ఎంతగానో సహకరించ రానీ అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ ప్రాంతానికి తాను ఎంతగానో రుణపడి ఉంటాను అన్నారు. చైర్మన్ పదవిని అలంకరించి ఐదు సంవత్సరాలు పూర్తయిందని మరోసారి గుర్తు చేశారు. తన విధి నిర్వహణలో తనకు సహకరించిన మునిసిపల్ సిబ్బందికి, కార్మికులకు పట్టణ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని ఎస్‌కేటి ఫంక్షన్ హాల్‌లో మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు హాజరై మాట్లాడుతూ అర్హులకు న్యాయం చేయకుంటే పోరాటమే, ప్రజా పాలన గ్రామ సభ దరఖాస్తుల స్వీకరణ కేవలం ప్రజలను ముంచటం కోసమే అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లడ్ల సెలక్షన్ లిస్ట్ అంతా తప్పులు చేశారని, అర్హులైన పేదలందరికీ కేటాయించ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది గా దరఖాసులను స్వీకరిసంతే టైం పాస్ పాలన చేస్తూ ప్రజలను గోసపెడుతుందన్నారు. రాబోయే పంచాయితీ ఎన్నికల జిమ్మిక్కు లాగానే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుంది తప్ప ప్రజలకు లబ్ది చేకూరేలా ప్రణాళిక బద్ధంగా అర్హులను గుర్తించే ప్రక్రియ చేపట్టి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు పెట్టిన దరఖాస్తులకు ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు కందుల కృష్ణార్జునరావు, సూదిరెడ్డి గోపిరెడ్డి, ఈధర సత్యనారాయణ, యువజన నాయకులు గద్దల రామకృష్ణ, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో పాల్గొన్న మేయర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు. సోమవారం ప్రజావాణిలో మేయర్ నీరజ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్పోరేషన్ పరిధిలో గల ప్రజలు శాఖపరమైన సమస్యల గురించి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిష్కారమయ్యేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటారని ఆమె తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు రాని వారు మరల దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తారని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వసుంధర, ఆర్‌వో జి. శ్రీనివాస్, జేఏవో శివలింగం, లింగయ్య, సిసి రాంబాయి, శానిటేషన్ సూపర్ వైజర్ సాంబయ్య, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి తవ్వకాలను పరిశీలించిన బిజెపి బృందం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండలం జింకలతండా క్రాస్ రోడ్డు వద్ద మట్టి తవ్వకాలను బిజెపి పార్టీ ప్రతినిధుల బృందం పరిశీలించారు. సోమవారం బిజెపి జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గుత్తా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మట్టి తవ్వకాలను పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో జింకలతండా క్రాస్ రోడ్డు వద్ద గల మట్టి గుట్టలను అక్రమంగా తవ్వారన్న ఆరోపణలు ఉన్నాయని వేల కోట్ల రూపాయల మట్టి దందా జరిగిందని వారు తెలిపారు. ఇప్పుడు అనుమతుల పేరుతో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయని వారు తెలిపారు. అనుమతులు ఎంత మేర తీసుకున్నారు, ఎంత మట్టిని తరలిస్తున్నారు అనే దానిపై ఉన్నతాధికారులను, మైనింగ్ అధికారులను కలిసి వివరాలు సేకరిస్తామని తెలిపారు. ప్రజా అవసరాల పేరుతో అక్రమంగా మట్టిని తరలిస్తే అడ్డుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గుత్తా వంశీ, అల్లిక అంజయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సిఐగా మధుకు ప్రశంసాపత్రం



**ప్రజాపక్షం/మధిర :** మధిర సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో చాకచక్యంగా కేసులను పరిష్కరిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న డి.మధు ఉత్తమ సిఐగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ చేతుల మీదుగా సిఐ మధు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. సిఐ మధును నియోజకవర్గంలోని పలువురు అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజలు తదితరులు అభినందనలు తెలిపారు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పోలీస్‌స్టేషన్ ఎస్సైలను కలుపుకుంటూ పోతూ ఎటువంటి అవాంచనీయం సంఘటనలు జరుగకుండా ఎటప్పటికప్పుడు లా అండ్ ఆర్డర్‌కు పటిష్ట చర్యలు తీసుకున్న సిఐ చేసిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ సిఐ ప్రశంసాపత్రం అందుకోవటం జరిగిందని పలువురు వ్యక్తులు తమ అభిప్రాయాన్ని తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# తరచూ ప్రమాదాలపై స్పందించిన జాతీయ రహదారుల అధికారులు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని తరచూ ప్రమాదాలపై జాతీయ రహదారుల అధికారులు స్పందించి రహదారిపై ఎత్తుపల్లాలు ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై ఇబ్బందులు పడుతుండటంతో జాతీయ రహదారులు అధికారుల స్పందించి జెసిబి తో రోడ్డు మధ్యలో ఎత్తు పల్లాలుగా ఉండటం వలన ప్రమాదాలకు కారణం అవుతున్నాయని ప్రజలు ఫిర్యాదుల మేరకు ఎత్తుఫలాలను చదును చేస్తున్నారు. కల్లూరు లోని హిమాలయ రెస్టారెంట్, రాజ్యలక్ష్మి సూపర్ మార్కెట్, పాత ఆంధ్ర బ్యాంక్, ఎటిఎం ప్రభుత్వాసుపత్రిల వద్ద జెసిబి లతో తారు రోడ్డును చదును చేస్తున్నారు. దీంతో స్పందించిన అధికారులకు కల్లూరు పట్టణ మండల ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

# తాగునీరు లేక.. ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడలోని ఫారెస్ట్ ఆఫీసర్ ఏరియాలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం వాటర్ సప్లయి అవుతున్న బోరు వద్ద ఖాళీ బిందెలతో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. గత వారంరోజుల నుండి తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోకవటం లేదని ఆరోపించారు. బోరు చెడిపోతే వాటర్ ట్యాంక్ ద్వారా నీళ్లు అందించి మంచినీటి ఇబ్బందులు తీర్చాలి గాని, బోరుకు ఎటువంటి మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని ప్రజలు మండిపడ్డారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈలప్రోలు నాగమణి, బొడ్డు జయ, సిరిగి నాగేశ్వరి, బీరెల్లి లక్ష్మి , గుల్ఫర్ అఖిల తదితరులు పాల్గొన్నారు.

# ధర్నాకు ఖమ్మం తరలిన కార్మికులు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న ఏజెన్సీ కార్మికులు సోమవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు తరలి వెళ్లారు. మార్కెట్‌లో ధరలకు అనుగుణంగా మెనూ చార్జి ఒక్కో విద్యార్థికి 25 రూపాయలు చెల్లించాలని, ప్రభుత్వమే కోడిగుడ్డు సరఫరా చేయాలని లేనిచో కోడిగుడ్డు బంద్ చేస్తామని , మెనూ చార్జీలు పెంచనందున ఒక కూర వారానికి , రెండు కోడి గుడ్లు మాత్రమే అందిస్తామని, వంట కార్మికులను తొలగించకుండా జీవో జారీ చేయాలని , ప్రభుత్వం ఎన్నికల హామీ పదివేల ఇస్తానన్న హామీని అమలు పరచాలని, వంట సమయంలో జరుగుతున్న ప్రమాదానికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గత తొమ్మిది నెలలుగా 9 ,10 తరగతులకు చెల్లించాల్సిన పెండింగ్ కోడిగుడ్డు బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ కల్లూరు నుంచి ఖమ్మం కు సోమవారం తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, మధ్యాహ్న భోజన నాయకులు సత్యవతి, అప్పమ్మ ,శారద, తిరుపతమ్మ, అలివేలు, రాజ్యలక్ష్మి , సుశీల, మార్తమ్మ, మేరమ్మ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# మధిరలో ఘనంగా ఎలక్ట్రీషియన్ డే వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణం ఆర్‌వి కాంప్లెక్స్ వద్ద మధిర ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా సోమవారం జెండాను ఆవిష్కరించి ఎలక్ట్రీషియన్ వర్కర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఎలక్ట్రీషియన్ వర్కర్స్‌కి అండగా ఉంటుందన్నారు. అనంతరం ఎలక్ట్రీషియన్స్ వర్కర్స్‌కు 20మందికి లేబర్ ఇన్సూరెన్స్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రఘు, కె.సుధాకర్, ఎం.జాని, నాగరాజు, అప్పారావు, అనీల్, ఆశీర్వాదం, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉద్యోగిగా తహశీల్దార్ ప్రతాప్‌కు ప్రశంసాపత్రం



**ప్రజాపక్షం/పెనుబల్లిః** ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ ఉద్యోగిగా పెనుబల్లి తహశీల్దార్ ప్రతాప్ ఎంపిక అయ్యారు. రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఖమ్మంలో అవార్డు అందుకున్నారు. ప్రతాప్ తహశీల్దార్‌గా 22.09.23న భాధ్యతలు స్వీకరించారు. భాధ్యతలు చేపట్టిన నాటి నుండి విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ శాఖ పరిధిలోని పనులను ప్రజలకు అవినీతికి తావులేకుండా పనులు చేశారు. నీతిపరుడు అని పేరొందారు. ముఖ్యంగా రైతులకు భూమి విషయంలో రిజిస్ట్రేషన్‌లు, విద్యార్థులకు సంబంధించిన కుల, ఆదాయ, నివాస, నిరుద్యోగులకు సంబంధించిన ధృవపత్రాలు ఎటువంటి జాప్యం లేకుండా అందించారు. తోటి ఉద్యోగులను సమన్వయ పరచి కార్యాలయంలో ప్రజలకు సంబంధించి ఆటంకం లేకుండా ఉద్యోగులు తాను అందుబాటులో ఉన్నారు. తహశీల్దార్ అంటే ఇలా ఉండాలి, రెవిన్యూ కార్యాలయం అంటే ఇది అనేలా నిరూపించారు అని మండల ప్రజల మన్ననలు పొందటమే కాకుండా అందరికి ఆదర్శంగా నిలిచారని అన్ని శాఖల ఉద్యోగుల నుండి ప్రశంసలు పొందారు.